క్లుప్తంగా

ప్రభుత్వ విప్ పరామర్శ



లక్ష్మవ్వ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, నాయకులు

చందుర్తి: మండలంలోని కిష్టంపేట, లింగంపేట, కట్టలింగంపేట గ్రామాల్లోని పలు కుటుంబాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం పరామర్శించారు. కిష్టంపేటకు చెందిన మ్యాదరి లక్ష్మవ్వ మృతిచెందగా ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. లింగంపేటకు చెందిన ఈగ లచ్చయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా, అతడి వైద్యానికి రూ.2.50లక్షల ఎల్‌వోసీ అందజేశారు. కట్టలింగంపేటకు చెందిన బైరిగోని అంజన్‌రావుకు మోకీలు శస్త్ర చికిత్స జరుగగా అతడిని పరామర్శించారు. విప్ వెంట పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, ముస్కు ముకుందరెడ్డి, గొట్టే రుక్మిణి, బానాల గంగారెడ్డి, కోమటిరెడ్డి సత్తిరెడ్డి, గొట్టే ప్రభాకర్, పోతుగంటి రఘుపతి, బానాల లక్ష్మారెడ్డి, కేతిరెడ్డి నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ మొగిలి

ఇల్లంతకుంట: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని వెల్జిపురంలో నిర్వహించిన మీకోసం పోలీసులు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సెల్‌ఫోన్లలో వచ్చే ఓటీపీలకు సమాధానం ఇవ్వకూడదని సూచించారు. యువకులు గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఆపద సమయంలో 100 డయల్ ఏ విధంగా ఉపయోగించుకోవాలో వివరించారు. అలాగే నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని యువకులకు సూచించారు. ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్‌కూలర్ అందజేత



వాటర్ కూలర్ అందజేస్తున్న విక్రమ్‌కుమార్‌రెడ్డి

చందుర్తి: మండలంలోని ఎన్గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శుక్రవారం వేములవాడ ఎస్‌బీఐ బ్రాంచ్ ఆధ్వర్యంలో వాటర్‌కూలర్ అందజేశారు. విద్యార్థులకు చల్లని నీరు అందించాలనే లక్ష్యంతో రూ.30వేల విలుగ గల వాటర్ కూలర్ ఎస్‌బీఐ వేములవాడ బ్రాంచ్ ఉద్యోగి మారెల్లి విక్రమ్‌కుమార్‌రెడ్డి అందించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం సునీతారాణి కృతజ్ఞతలు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దర్ర గోదావరి, పాఠశాల అభివృద్ధి సలహదారు గడ్డం దేవయ్య, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గుర్రం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీరాముల నరేందర్, ప్యారం లక్ష్మీనారాయణ, ఎడ్ల కృష్ణచైతన్య, ఐలవేణి సుస్మిత, కట్టుపల్లి ఉదయ్‌భాస్కర్, చిలుముల కవిత, వీరగోని చైతన్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనపై కళాయాత్ర



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న కళాకారులు

వేములవాడఅర్బన్: ప్రజాపాలనలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను శుక్రవారం వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్, తిప్పాపూర్‌లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రదర్శన ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, యువతకు 56 వేల ఉద్యోగ ఉపాధి అవకాశాలు, గృహజ్యోతి కింద పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500 సిలిండర్, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వైద్యం, రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీపై వివరించారు. జిల్లా సాంస్కృతిక సారథి కళాబృందం టీం లీడర్ ఎడమల శ్రీధర్‌రెడ్డి, పాత్తూరి రాజు, రామచంద్రం, గడ్డం దేవయ్య, శ్రీనివాస్, గణేశ్, సంజీవ్ తదితరులు ఉన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం



పశువులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

వీర్నపల్లి: మండలంలోని భూక్య తండా గ్రామంలో శుక్రవారం పశుగణాభివృద్ధి సంస్థ కరీంనగర్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మించే ఆడ దూడల గురించి అవగాహన కల్పించారు. 68 పశువులకు చికిత్స చేశారు. మండల పశు వైద్యాధికారి రాహుల్ శ్రీనివాస్, గోపాల్ మిత్ర సూపర్‌వైజర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

కర్రంట్ స్తంభం

ఆ గృహాలకు విద్యుత్ లైన్ మంజూరు చేసిన సెస్ అధికారులు పూర్తిస్థాయిలో స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతో లూజ్‌వైర్లు కిందికు వేలాడాయి. దీంతో గృహ యజమానులే కర్ర రక్షణగా ఏర్పాటు చేసి ప్రమాదం జరగకుండా చూసుకుంటున్నారు. ఇది వేములవాడ పట్టణం నుంచి మల్లారంకు వెళ్లే జయవరం గ్రామ పరిధిలో ఉంది.

- వేములవాడరూరల్



దూరం దగ్గరైంది

- ప్రారంభానికి సిద్ధమైన బ్రిడ్జి
- నేడు ప్రారంభించనున్న కేంద్ర మంత్రి బండి సంజయ్



మానేరువాగుపై ప్రారంభానికి సిద్ధమైన బ్రిడ్జి

గంభీరావుపేట(సిరిసిల్ల): ఏళ్ల ఎదురుచూపులు ఫలించనున్నాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవతో దూరం దగ్గరకానుంది. గంభీరావుపేట మండల కేంద్రం, మల్లారెడ్డిపేట గ్రామాల మధ్య మానేరువాగుపై నిర్మించిన హైలెవల్ బ్రిడ్జి పనులు పూర్తయ్యాయి. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, కరీంనగర్ ఎంపీ బండ సంజయ్‌కుమార్ చేతుల మీదుగా శనివారం ప్రారంభించనున్నారు.

రూ.20కోట్లతో నిర్మాణం

ప్రధానమంత్రి సడక్ యోజనలో భాగంగా కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో దాదాపు రూ.20కోట్లతో హైలెవల్ వంతెన పనులు చేపట్టారు. దీంతో ఇరు గ్రామాలతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు, రైతులకు ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. ఇన్నాళ్లు ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం పనులు పూర్తయి బ్రిడ్జి వినియోగంలోకి రానుండంతో వాహనదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వాగుపై బ్రిడ్జి లేకపోవడంతో ప్రయాణికులు చుట్టూ తిరిగివచ్చేవారు. మల్లారెడ్డిపేటలో సుప్రసిద్ధ శ్రీవీరాంజనేయస్వామి దర్శనానికి మండల పరిధిలోని గ్రామాల నుంచే కాకుండా చుట్టుపక్కల మండలాల నుంచి వస్తుంటారు. మానేరు వాగు అడ్డుగా ఉండడంతో చుట్టూ తిరిగాల్సిన దుస్థితి. వాగుపై వంతెన పూర్తి కావడంతో దాదాపు 10 కిలోమీటర్ల దూరభారం తగ్గనుంది.

మిడ్‌మానేరు బాధితులను ఆదుకోవాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్లటౌన్: మిడ్‌మానేరులో 12వేల కుటుంబాలు ఇళ్లు, భూములు కోల్పోయాయని, ఆ కుటుంబాలను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. సిరిసిల్లలోని కార్మిక భవనంలో శుక్రవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. నిర్వాసితులకు ఆనాటి ప్రభుత్వాలు ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు ఇస్తానని మాట ఇచ్చి మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 12వేల కుటుంబాలలో 4696 కుటుంబాలకు మాత్రమే ఇళ్ల ఇవ్వడం బాధాకరమన్నారు. అందరికీ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. నాయకులు రవి, సోమ నాగరాజు, శ్రావణపల్లి మల్లేశం, బాచుపల్లి శంకర్ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో సర్కార్ చెలగాటం



మాట్లాడుతున్న రవిగౌడ్

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ విద్యా సంస్థలు, వసతి గృహాల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థుల ప్రాణాలతో సర్కారు చెలగాటం ఆడుతుందని బీఆర్‌ఎస్‌వి రాష్ట్ర నాయకులు కంచర్ల రవిగౌడ్ ఆరోపించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి గురుకులాలను నరక కూపాలుగా మార్చారని విమర్శించారు. నారాయణపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో 50 మంది విద్యార్థులు ఆసుపత్రి పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. 11 నెలల కాలంలో పదుల సంఖ్యలో విద్యార్థులు చనిపోగా.. వందల సంఖ్యలో విద్యార్థులు ఫుడ్ పాయిజన్ బారిన పడుతున్నారన్నారు. ఇప్పటికైనా సీఎం అధికారులతో సమీక్ష జరిపించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఆస్పత్రి పాలైన నారాయణపేట విద్యార్థులను హైదరాబాద్ తరలించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మట్టే శ్రీనివాస్, కోడం వెంకటేశ్, ఒగ్గు అరవింద్, అనిల్‌గౌడ్, మూడ సాయి, కోడి రోహిత్, సామల శ్రీకాంత్, వెల్మల శ్రీనివాస్, కొండి నవీన్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

పనిష్మెంట్ ఇచ్చినోళ్లే.. ప్రమోషన్ ఇస్తారా?



ప్రెస్‌మీట్‌లో ఏబీవీపీ నాయకులు

సిరిసిల్లటౌన్: పనిష్మెంట్ ఇచ్చిన అధికారులే సదరు ఉద్యోగికి ప్రమోషన్ ఎలా ఇస్తారని ఏబీవీపీ తెలంగాణ హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్ విమర్శించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. వీర్నపల్లి కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేసే ఉద్యోగి నిర్లక్ష్యంతో ఓ విద్యార్థి గోడదూకి గాయాలపాలైందన్నారు. ఈఘటనమై డీఈవో ఆమెను బదిలీ చేస్తూ, రుద్రంగి కేజీబీవీలో సీఆర్పీగా విధులు నిర్వర్తించాలని గత నెలలో ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. పక్షం రోజులు గడవక ముందే తిరిగి బోయినపల్లి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తూ గత నెల 29న ఉత్తర్వులు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చొప్పదండి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బోయిన్‌పల్లి ఎస్‌వోగా తీసుకోవడం ఏంటని ప్రశ్నించారు. ఈవిషయంలో డీఈవోపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో విద్యావ్యవస్థను డీఈవో గాలికి వదిలేశారని విమర్శించారు. జిల్లాలో తరచూ ఫుడ్ పాయిజన్ జరిగి విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నా నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజురావు, టౌన్ సెక్రటరీ ఎల్లగందుల శ్రీనివాస్, రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

సన్నవడ్ల సాగుకే రైతుల మొగ్గు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల్లోని రైతులు సన్నవడ్లను సాగుచేసేందుకు మొగ్గుచూతున్నారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఖరీఫ్‌లో సాగుచేసిన సన్నాలకు రూ.500 బోనస్ ప్రభుత్వం చెల్లిస్తుండడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తుందన్నారు. ప్రభుత్వంపై నమ్మకంతోనే ఈ సీజన్‌లోనూ సన్నవడ్ల విత్తనాలు కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

● చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్, నారాయణపూర్, వెంకటాపూర్, హరిదాస్‌నగర్ గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు.

గంభీరావుపేటలో..

గంభీరావుపేట: మండలకేంద్రంలో పలువురు లబ్ధిదారులకు శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు.

● హార్వెస్టర్, కారు ఢీ

చందుర్తి: మండలంలోని లింగంపేటకు చెందిన అల్లాడి కృష్ణ కారులో వేములవాడకు వెళ్తుండగా మల్యాల శివారులో కల్వర్టు వద్ద హార్వెస్టర్, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. కృష్ణ స్వల్పంగా గాయపడ్డారు.

● పోలీసుల అదుపులో ఇద్దరు

కోనరావుపేట: మండలంలోని ఎగ్లాస్‌పూర్‌లో అనుమతులు లేకుండా గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో బండను పగులగొట్టేందుకు జిలెటిన్ స్టిక్స్ వాడుతున్నారన్న ఫిర్యాదుతో పోలీసులు దాడులు చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు.

● విద్యుత్ మోటార్ల చోరీ

ఇల్లంతకుంట: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో రూ.1 లక్ష విలువైన విద్యుత్ మోటార్లను దొంగలించారు. బాధితులు శుక్రవారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● అనుమతి లేకుండా బోర్లు వేయొద్దు

ముస్తాబాద్: మండల పరిధిలో అనుమతులు లేకుండా బోర్లు వేయొద్దని తహసీల్దార్ సురేశ్ సూచించారు. వాల్టా చట్టం ప్రకారం అనుమతులు పొందిన తర్వాతే బోరు బావులు తవ్వించుకోవాలన్నారు. ఇటీవల రైతులు తమ పంట పొలాల వద్ద వేస్తున్న బోర్లపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొన్నారు.

● పంట వ్యర్థాలను కాల్చొద్దు

ముస్తాబాద్: రైతులు పంట వ్యర్థాలను కాల్చవద్దని మండల వ్యవసాయాధికారి అనూష అన్నారు. ముస్తాబాద్ రైతువేదికలో రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కొయ్యకాళ్ల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఏఈవోలు ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి కొయ్యకాళ్లపై అవగాహన కల్పించాలన్నారు.

● వరి కొయ్యలను..

ఇల్లంతకుంట: వరి కొయ్యలు, పత్తి కట్టెలు కాల్చకుండా అవి కుళ్లిన తర్వాత భూమికి సేంద్రియ ఎరువుగా వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సురేశ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, పంట అవశేషాలను కాల్చడం వల్ల వాతావరణం కాలుష్యం అవుతుందన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శిగా రమేశ్



సిరిసిల్లటౌన్: ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన మహాసభలో సీపీఎం జిల్లా కార్యదర్శిగా ముషం రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా రెండోసారి పార్టీ జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.స్కైలాబ్‌బాబుతో పాటు జిల్లా నాయకులు, కార్యకర్తలకు రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం

వేములవాడఅర్బన్: మున్సిపల్ పరిధి నాంపల్లికి చెందిన వేములవాడ మాజీ ఎంపీపీ మేర్గు రఘు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈనేపథ్యంలో బాధిత కుటుంబానికి 1984 పదో తరగతి బ్యాచ్ గ్రూపు స్నేహితులు రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు.

విజయవంతం చేయాలి

గంభీరావుపేట: సిరిసిల్లలో ఈ నెల 23న నిర్వహించే మాల, మాల ఉపకులాల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో శుక్రవారం సభకు సంబంధించి ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా కార్యదర్శి దోసల ఉపేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు లక్కం బాబు, జిల్లా అధికార ప్రతినిధి రఘు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత

కోనరావుపేట: మండలంలోని కొండాపూర్‌లో ఇసుక ట్రాక్టర్లను రైతులు అడ్డుకున్నారు. కోనరావుపేట గ్రామానికి అవసరమైన ఇసుక కోసం కొండాపూర్ మూలవాగు నుంచి అనుమతులు ఇచ్చారు. తమ గ్రామం నుంచి ఇసుకను తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

భగీరథ.. వృథా



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో ప్రజల దాహం తీర్చాల్సిన మిషన్ భగీరథ నీళ్లు వృథాగా మురికి కాలువల పాలవుతున్నాయి. మండల కేంద్రంలో చాలా చోట్ల నల్లా కనెక్షన్లు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. అసంపూర్తి కనెక్షన్లతో భగీరథ మురికి కాలువలు, రోడ్లపై వృథాగా పోతుంది. సంబంధిత అధికారులు వెంటనే ప్రతీ ఇంటికి నల్లా కనెక్షన్ పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గాయత్రీ యజ్ఞం



వేములవాడ రూరల్: వేములవాడరూరల్ మండలం ఎదురుగట్ల గ్రామంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రీ పరివార్ గురువు తాళ్ల లక్ష్మీరాజం మాట్లాడుతూ, ప్రజలు ఆయురారోగ్యాలతో జీవించాలని, విద్యార్థులు, యువతరం సనాతన ధర్మంలో భాగస్వాములు కావాలని కోరారు. చైర్మన్ సంపేట గంగరాజు, అర్చకులు కార్తీక్, ఎగుర్ల శ్రీనివాస్, పొన్నం బాలయ్య, గోపాలకృష్ణ, చందనం రాజేశ్ పాల్గొన్నారు.



కోనరావుపేట: మండలంలోని సుద్దాల శివారులో రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వాహనాలు వేగంగా వస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

–ఉప్పుల గంగయ్య, సుద్దాల

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
అంజయ్య, పంచాయతీరాజ్ ఏఈ, సెల్ నంబర్ 98485 18443

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

బీడీ కార్మిక సంఘం మహాసభ జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీడీ కార్మికులు

వేములవాడఅర్బన్: బీడీ కార్మిక సంఘం ఏఐటీయూసీ జిల్లా 2వ మహాసభ ఈ నెల 24న జిల్లా కేంద్రంలోని కార్మిక భవన్‌లో నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు తెలిపారు. వేములవాడ పట్టణంలోని శుక్రవారం మహాసభ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. సభకు బీడీ కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవతం చేయాలని కోరారు. బీడీ కార్మిక సంఘం జిల్లా నాయకురాలు అనసూర్య, గంగవ్వ, రాధిక తదితరులు ఉన్నారు.

నలభై ఏళ్ల విద్యాసేవ స్ఫూర్తిదాయకం



బుచ్చిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

ముస్తాబాద్: నాలుగు దశాబ్దలుగా విద్యారంగంలో వేలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన ఫిజికల్ డైరెక్టర్ వెల్మల బుచ్చిరెడ్డి సేవలు స్ఫూర్తిదాయకమని ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి అన్నారు. ముస్తాబాద్ జెడ్పీ ఉన్నత బాలుర పాఠశాల పీడీ వెల్మల బుచ్చిరెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బుచ్చిరెడ్డి చిన్న వయసులోనే ఉపాధ్యాయ ఉద్యోగం సాధించి సుదీర్ఘ సేవలు అందించారన్నారు. బుచ్చిరెడ్డి, సుష్మ దంపతులను సన్మానించారు. ఎంఈవో రాజిరెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, హెచ్‌ఎంలు లక్ష్మణ్, రాజ్‌కుమార్, రాధాకిషన్‌రావు, విఠల్, రవీందర్, మాజీ సర్పంచ్ తిరుపతి, ట్రస్మా మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హమాలీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

కోనరావుపేట: హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొండాపూర్‌లో కార్మికులతో కలిసి మాట్లాడారు. జిల్లాలో హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో గత ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందాయన్నారు. పదేళ్ల క్రితం హమాలీ కార్మికులకు లారీల యజమానులు తాడు మామూలు ఇచ్చేవారని, ఇప్పుడు తాడు మామూలు ఇవ్వకుండా కార్మికుల పొట్ట కొడుతున్నారని వాపోయారు. తాడు మామూలు రేట్లు పెంచాలని అడిగితే వలస కార్మికులను తీసుకువచ్చి స్థానిక హమాలీ కార్మికులకు పని లేకుండా చేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. ఇప్పటికైనా హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, తాడు మామూలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లు కూడా పెంచాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. జిల్లాలోని హమాలీల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని అన్నారు. సమావేశంలో అంకుష్, నరేశ్, రాములు, రాజు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ×మాలల సింహగర్జన¤ పోస్టర్‌ను రాష్ట్ర కో చైర్మన్ నల్లల కనకరాజు, జిల్లా చైర్మన్ రాగుల రాములు శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. డిసెంబర్ 1న సికింద్రాబాద్‌లో నిర్వహించే సింహగర్జన సభకు మాలలు, ఉపకులాల ప్రజలు పెద్దెత్తున హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి దశరథం, రొడ్డ శ్రీనివాస్, వంకాయల భూమయ్య, గొట్టె లింగయ్య, బూర బాబు, బూర అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో ప్రతిభ



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో గల జ్ఞానదీప్ పాఠశాల విద్యార్థులు మండల స్థాయి చెకుముకి పోటీల్లో మొదటి స్థానం కైవసం చేసుకున్నట్లు కరస్పాండెంట్ మిట్టపల్లి లక్ష్మీనారాయణ తెలిపారు. జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంఈవో కృష్ణహరి తదితరులు పాలొన్నారు.

సత్తాచాటిన మోడల్‌స్కూల్ విద్యార్థులు

సిరిసిల్లఎడ్యుకేషన్: తంగళ్లపల్లి మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులో మండేపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు శ్రీవిద్య, సుశ్రుత్, అయాన్ ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. ఎంఈవో రాజునాయక్, ప్రిన్సిపాల్ విఠల్, సైన్స్ ఉపాధ్యాయులు సాగర్, హరీశ్, అరవింద్, రమేశ్, శ్రీనివాస్ తదితరులు అభినందించారు.